# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో ఈరోజు సమావేశమవుతున్నారు.**
2. **విద్యుత్‌రంగ సంస్కరణలపై సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల మంత్రుల ఉపసంఘం ఈరోజు విజయవాడలో సమావేశం కానుంది.**
3. **పోలవరం నిర్వాసిత గిరిజనులకు అంత్యోదయ పథకం కింద బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
4. **పొగాకు రైతులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా చేయూతనందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు.**
5. **ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తయ్యేలా సహకారం అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, కేంద్రమంత్రిని కోరారు. అనంతరం కేంద్ర న్యాయ శాఖామంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తో భేటీ అయ్యారు. అనంతరం కేంద్రమంత్రులు అమిత్‌షా, పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

------------------------

విద్యుత్‌రంగ సంస్కరణల్లో రాష్ట్రం సాధించిన పురోగతిని గుర్తించి..ఈ రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై సమీక్షించేందుకు వివిధ రాష్ట్రాల విద్యుత్ శాఖల మంత్రులతో ఏర్పాటు చేసిన ఉపసంఘం ఈరోజు విజయవాడలో సమావేశమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. పెట్టుబడుల ప్రణాళికల రూపకల్పనకు మార్గదర్శకాలపై కూడా ఇక్కడ సమీక్షిస్తారని వివరించారు. ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్, నూతన పునరుత్పాదక ఇంధనశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ అధ్యక్షత వహిస్తారన్నారు. రాష్ట్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన మంత్రులు పాల్గొంటారని చెప్పారు.

------------------------

పోలవరం నిర్వాసిత గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ అంత్యోదయ పథకం కింద బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో కూటమి నేతలతో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... తాము క్షేత్రస్థాయిలో చూసిన కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పోలవరం నిర్వాసిత గిరిజనులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలియజేస్తూ....

..వాయిస్.. 29 సెకన్లు

---------------------------

పొగాకు రైతులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా చేయూతనందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని రెండవ పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, ధరల గురించి రైతులు, రైతు సంఘ నాయకులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... లో గ్రేడ్ పొగాకు ఎక్కువగా తిరస్కరణకు గురవుతోందని ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ..

...వాయిస్..29 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాలు రేపు ఉదయం 10గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫలితాలను సైతం విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను bse.ap.gov.in, apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లతో పాటు ‘మన మిత్ర’ వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

విజయనగరం పట్టణం, భోగాపురం విమానాశ్రయానికి నీరందించడంలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు కీలకమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును అధికారులతో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

వడదెబ్బ కారణంగా ఏ ఒక్క ప్రాణం పోకూడదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోంమంత్రి ఈరోజు దీనిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున .. వాతావరణ మార్పులకు తగ్గట్లు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని సూచించారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ తీవ్రమవుతున్న వాతావరణ సమస్యలపై దృష్టి సారించే ఉద్దేశ్యంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. వాతావరణ కాలుష్యం ...., విచక్షణా రహితంగా అడవుల నరికివేత వంటి అంశాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతిని జీవ మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. అందువల్లనే భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహనా కల్పిస్తూ ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1970 నుండి ప్రతి ఏటా ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిని అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే అని కూడా పిలుస్తారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషన్ పక్వాడా కార్యక్రమం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అధిక పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని కృష్ణాజిల్లా నోడల్ అధికారి భానుమతి తెలిపారు. పోషన్ పక్వాడా పక్షోత్సవాలు రేపటి వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో జరుగుతున్నాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలలో రక్త హీనత నివారించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందనీ, ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఆమె పిలుపునిస్తూ...

...వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యను నేర్చుకుని మంచి ప్రయోజకుల కావాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో కలెక్టర్ నిన్న విద్యాశాఖ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనపై శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మాత్రమే ఉంటారని.. పిల్లల శారీరక, మానసిక, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేది ప్రభుత్వ పాఠశాలలేనని అన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 21 సెకన్లు....

=====================